# అక్షర దర్బార్

www.aksharadarbar.com

Voice of the people

మంగళవారం, 30, జూన్ 2026 | సంపుటి : 03 | సంచిక : 137 | పేజీలు : 05 | వెల ₹5




# వరంగల్ సీపీగా శ్వేత

- ఆమె ఇక్కడ తొలి మహిళా సీపీగా నియామకం
- సన్ ప్రీత్ సింగ్ సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ గా బదిలీ

02



## 'పరకాల' ప్రగతికి

# గ్రహణం!

### ఓట్ల వేళ ఊరించిన హామీలు.. గెలిచాక నీటిమూటలు..

- ప్రజాప్రతినిధుల తీరుపై జనం ఆగ్రహం
- కూడళ్లలో కుమ్ములాటలు తప్ప.. కూడు పెట్టే పరిశ్రమలేవీ?
- ఇంజనీరింగ్, నర్సింగ్ కళాశాలలపై పాలకుల ఉదాసీనత.. ఫైళ్లలోనే మగ్గుతున్న ప్రతిపాదనలు.
- ఉపాధి లేక యువత వలసలు.. గంజాయి, దురలవాట్ల బారిన పడుతున్న వైనం.
- ట్రాఫిక్ పద్మవ్యూహంలో పట్టణం.. శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్.

02

అక్షర దర్బార్, పరకాల:

చారిత్రక పోరాటాలకు, రాజకీయ చైతన్యానికి మారుపేరైన పరకాల నియోజకవర్గం స్వరాష్ట్రంలోనూ ప్రగతి లేమికి అద్దం పడుతోంది. ఎన్నికల సమయం వచ్చిందంటే చాలు.. ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి వరాల జల్లు కురిపించే ప్రజాప్రతినిధులు, అధికార పీఠం ఎక్కాక ఆ హామీలను తుంగలో తొక్కుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిత్యం రాజకీయ విమర్శలు, ప్రతివిమర్శలతో కాలక్షేపం చేస్తున్న నాయకులు.. స్థానిక సమస్యలను పట్టించుకోవడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. విద్య, వైద్యం, ఉపాధి, మౌలిక వసతుల సాధన కోసం అన్ని పార్టీలు రాజకీయాలు పక్కనబెట్టి సమిష్టిగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని స్థానికులు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు.

# కమలం వికసించటం ఖాయం

### 2028లో తెలంగాణలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమే

- గ్రేటర్ వరంగల్ ఎన్నికల్లోనూ కమలం జెండా ఎగరాలి
- రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు జీడబ్ల్యూఎంసీ ఎన్నికలే సెమీఫైనల్స్
- 'వికసిత్ వరంగల్... వికసిత్ తెలంగాణ' మన నినాదం కావాలి
- బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ పిలుపు
- కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలనలపై విమర్శల జల్లు
- భద్రకాళి అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు

05

అక్షరదర్బార్, వరంగల్ : రాబోయే గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కమలం జెండాను ఎగరేయడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కదలాలని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నవీన్ సిన్హా పిలుపునిచ్చారు. సోమవారం హనుమకొండలో నిర్వహించిన భారతీయ జనతా పార్టీ బూత్ అధ్యక్షుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాబోయే గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలే టార్గెట్‌గా పనిచేయాలని పార్టీ క్యాడర్‌కు దిశా నిర్దేశం చేశారు.








## బల్దియా నయా బాస్ ఆగయా

### జీడబ్ల్యూఎంసీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన టి వెంకన్న

అక్షరదర్బార్, వరంగల్: కొద్ది రోజుల క్రితం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) కమిషనర్‌గా నియమితులైన టి వెంకన్న సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో పదవీ బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు నగరానికి చేరుకున్న కమిషనర్‌కు జీడబ్ల్యూఎంసీ ఉన్నతాధికారులు మడికొండ గ్రాండ్ ఎంట్రన్స్ వద్ద పుష్పగుచ్ఛం అందజేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం కమిషనర్ టి వెంకన్న వరంగల్‌లోని శ్రీ భద్రకాళి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక ఆశీర్వచనాలు అందించి, అమ్మవారి తీర్థప్రసాదం, శేషవస్త్రాలను సమర్పించారు. ఆ తర్వాత హనుమకొండలోని ఐడీఓసీ కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ను వెంకన్న మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధి, నగర పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాల మెరుగుదల, ప్రజలకు సమర్థవంతమైన పౌర సేవల అందింపుపై చర్చించారు. కొత్త కమిషనర్ బాధ్యతల స్వీకరణ సందర్భంగా జీడబ్ల్యూఎంసీ అధికారులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## భూపాలపల్లి డీటీఓగా శ్రీనివాస్

అక్షరదర్బార్, భూపాలపల్లి: జిల్లా రవాణాశాఖ అధికారి (డీటీఓ)గా బి శ్రీనివాస్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఐడీఓసీ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మను కలిసి మొక్కను అందించారు. ఇక్కడ డీటీఓగా విధులు నిర్వహించిన ఎం వెంకన్న ఈ నెల 22న ఆర్టీవో కార్యాలయం ఎదుట రోడ్డుపై వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో జరిగిన లారీ ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. దీనితో ఖాళీగా ఉన్న భూపాలపల్లి డీటీఓ పోస్టులో బి శ్రీనివాస్ ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.



## చేనేత సంఘాలకు ఎన్నికలు

- నోటిఫికేషన్ విడుదల
- 10న పోలింగ్.. ఫలితాలు


అక్షరదర్బార్, భూపాలపల్లి: రాష్ట్ర సహకార ఎన్నికల అథారిటీ ఆదేశాల ప్రకారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని హ్యాండ్లూమ్ సహకార సంఘాల ఎన్నికల నిర్వహణకు అధికారికంగా ఏర్పాట్లు పూర్తయ్యాయి. జిల్లాలోని ఆరు చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు జిల్లా సహకార శాఖ అధికారి వాలియా నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికలు జరగనున్న సంఘాలు చికినేపల్లి, రేగొండ, చల్లగరిగే, మొగుళ్ళపల్లి, గిద్దెముతారం, టేకుమట్ల.

**ఎన్నికల షెడ్యూల్ వివరాలు**

జిల్లా సహకార శాఖ అధికారి వెల్లడించిన వివరాల ప్రకారం ఎన్నికల పూర్తి షెడ్యూల్ ఈ క్రింది విధంగా ఉంది. ఈనెల 29న ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైంది. జూలై 2 నుండి 4 వరకు నామినేషన్ల స్వీకరణ (3 రోజుల పాటు). 5న నామినేషన్ల పరిశీలన. 6న నామినేషన్ల ఉపసంహరణ. 10న ఎన్నికల నిర్వహణ, ఫలితాల ప్రకటన

**ఓటర్లందరూ పాల్గొనాలి**

"చేనేత సహకార సంఘాల పరిధిలోని అర్హులైన ఓటర్లందరూ ఈ ఎన్నికల్లో ఉత్సాహంగా పాల్గొనాలి. ప్రజాస్వామ్య పద్ధతిలో జరిగే ఈ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో ముగించి, విజయవంతం చేయాలని కోరుతున్నామని సహకార శాఖ జిల్లా అధికారి వాలియానాయక్ అన్నారు.



**రాజకీయాలు పక్కనబెట్టి.. సమిష్టిగా కదలాలి**

"పరకాల చారిత్రక ప్రాధాన్యతను గుర్తించి విద్య, వైద్యం, పారిశ్రామిక రంగాల్లో ప్రత్యేక ప్యాకేజీలు ప్రకటించాలి. ఎన్నికలు అయిపోయిన తర్వాత కూడా రాజకీయ రంగులు పూసుకుని విమర్శలు చేసుకోవడం మానేసి.. అన్ని పార్టీలు, ప్రజాప్రతినిధులు సమిష్టిగా కృషి చేయాలి. అప్పుడే పరకాల భావితరాలకు ఆదర్శ ప్రాంతంగా మారుతుంది."

–పరకాల ప్రాంత ప్రజలు

# 'పరకాల' ప్రగతికి గ్రహణం!

## ఓట్ల వేళ ఊరించిన హామీలు.. గెలిచాక నీటిమూటలు..

- 'పరకాల' ప్రగతికి గ్రహణం!
- ఓట్ల వేళ ఊరించిన హామీలు..
- గెలిచాక నీటిమూటలు..
- ప్రజాప్రతినిధుల తీరుపై జనం ఆగ్రహం
- కూడళ్లలో కుమ్ములాటలు తప్ప.. కూడు పెట్టే పరిశ్రమలేవీ?
- ఇంజినీరింగ్, నర్సింగ్ కళాశాలలపై పాలకుల ఉదాసీనత.. ఫైళ్లలోనే మగ్గుతున్న ప్రతిపాదనలు.
- ఉపాధి లేక యువత వలసలు.. గంజాయి, దురలవాట్ల బారిన పడుతున్న వైనం.
- ట్రాఫిక్ పద్మవ్యూహంలో పట్టణం.. శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్.

అక్షర దర్బార్, పరకాల: చారిత్రక పోరాటాలకు, రాజకీయ చైతన్యానికి మారుపేరైన పరకాల నియోజకవర్గం స్వరాష్ట్రంలోనూ ప్రగతి లేమికి అద్దం పడుతోంది. ఎన్నికల సమయం వచ్చిందంటే చాలు.. ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి వరాల జల్లు కురిపించే ప్రజాప్రతినిధులు, అధికార పీఠం ఎక్కాక ఆ హామీలను తుంగలో తొక్కుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిత్యం రాజకీయ విమర్శలు, ప్రతివిమర్శలతో కాలక్షేపం చేస్తున్న నాయకులు.. స్థానిక సమస్యలను పట్టించుకోవడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. విద్య, వైద్యం, ఉపాధి, మౌలిక వసతుల సాధన కోసం అన్ని పార్టీలు రాజకీయాలు పక్కనబెట్టి సమిష్టిగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని స్థానికులు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు.

### ఇంజినీరింగ్ కల నెరవేరేనా..?

రాష్ట్రవ్యాప్తంగా గత ఏడాది 64 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను ఇంజినీరింగ్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేసిన తరుణంలో.. పరకాల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకూ ఆ భాగ్యం దక్కుతుందని స్థానిక విద్యార్థులు ఆశపడ్డారు. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే ద్వారా ప్రభుత్వానికి వినతులు పంపినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి పురోగతి లేదు. ఇక్కడ ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటైతే పరకాలతో పాటు చుట్టుపక్కల మండలాల పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఉన్నత సాంకేతిక విద్య సొంత ఊరిలోనే అందుబాటులోకి వస్తుంది.

### ట్రాఫిక్ నరకం.. రహదారి భద్రత శూన్యం!

పట్టణ జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులు పెరగకపోవడంతో పరకాల నిత్యం ట్రాఫిక్ జంజాటంలో చిక్కుకుంటోంది. ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్స్ లేకపోవడం, జంక్షన్ల విస్తరణ చేపట్టకపోవడంతో వాహనదారులు, పాదచారులు ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తోంది. నిత్యం జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు ట్రాఫిక్ నియంత్రణ చర్యలు యుద్ధప్రాతిపదికన చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

### 100 పడకల ఆసుపత్రికి 'నర్సింగ్' తోడయ్యేనా?

పట్టణంలో త్వరలో ప్రారంభం కానున్న 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి భవనం ఒక ఊరట కలిగించే అంశమే అయినప్పటికీ, దీనికి అనుబంధంగా ప్రభుత్వ నర్సింగ్ కళాశాలను కూడా మంజూరు చేయాలని స్థానికులు కోరుతున్నారు. నర్సింగ్ కళాశాల వస్తే స్థానిక యువతకు వైద్య విద్యలో శిక్షణ లభించడంతో పాటు, భవిష్యత్తులో ఇక్కడి ఆసుపత్రుల్లో నర్సింగ్ సిబ్బంది కొరత తీరుతుంది. తద్వారా వందలాది మంది యువతీ యువకులకు స్థానికంగానే ఉపాధి లభిస్తుంది.

### వలసల బాటలో యువత.. పడగవిప్పుతున్న గంజాయి సంస్కృతి

పరకాల ప్రాంతంలో పరిశ్రమల స్థాపన అనేది దశాబ్దాలుగా ఎండమావిగానే మిగిలిపోయింది. స్థానికంగా ఉపాధి మార్గాలు లేకపోవడంతో చదువుకున్న యువత పొట్టచేతబట్టుకుని హైదరాబాద్, ముంబై వంటి నగరాలకు వలస వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించకపోవడం వల్లే ఈ దుస్థితి ఏర్పడిందని మేధావులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఖాళీగా ఉంటున్న యువత ఉపాధి లేక గంజాయి, మాదకద్రవ్యాల వంటి దురలవాట్ల వైపు ఆకర్షితులవుతున్నారని, దీనికి అడ్డుకట్ట పడాలంటే పారిశ్రామికాభివృద్ధే ఏకైక మార్గమని స్థానికులు చెబుతున్నారు.

# నేటి నుంచి 'రైతు భరోసా'

- నిధుల విడుదలను ప్రారంభించనున్న సీఎం రేవంత్ రెడ్డి
- అన్నదాతల ఖాతాల్లోకి పంట పెట్టుబడి సాయం



అక్షరదర్బార్, హైదరాబాద్ : తెలంగాణలోని అన్నదాతలకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. వానాకాలం (ఖరీఫ్) సాగు పెట్టుబడి సాయం కింద అందించే 'రైతు భరోసా' నిధులను నేడు మంగళవారం నుంచి విడుదల చేసేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. తొలుత ఉమ్మడి ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలో భారీ బహిరంగ సభ ద్వారా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాలని భావించినప్పటికీ, గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వేదికను హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికకు మార్చారు. ఇక్కడి నుంచే ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి కంప్యూటర్ బటన్ నొక్కి రాష్ట్రవ్యాప్తంగా నిధుల విడుదలను అధికారికంగా ప్రారంభించనున్నారు.

### రూ.9,000 కోట్ల నిధులు

ఈ వానాకాలం సీజన్ కోసం ప్రభుత్వం సుమారు రూ. 9,000 కోట్ల నిధులను సిద్ధం చేసింది. రైతుల ఖాతాల్లోకి ఒకేసారి కాకుండా, గతంలో లాగే చిన్న కమతాల నుండి పెద్ద కమతాల వారికి విడతల వారీగా వరుసగా 9 రోజుల పాటు ఈ నగదు బదిలీ ప్రక్రియ కొనసాగనుంది. తొలి విడత గుంట నుంచి రెండు ఎకరాల వరకు భూ విస్తీర్ణం కలిగిన పట్టాదారు రైతుల ఖాతాల్లో రేపటి నుంచి డబ్బులు జమ అవుతాయి. దీనికోసం సుమారు రూ.900 కోట్ల నిధులు కేటాయించారు. అనంతరం రెండు ఎకరాలకు పైగా ఉన్న రైతులకు వరుసగా రాబోయే రోజుల్లో నిధులు పూర్తిగా జమ కానున్నాయి. రైతు భరోసా పథకం కింద రైతులకు ఏటా ఎకరానికి రూ.12,000 చొప్పున ఆర్థిక సహాయం అందుతుంది. ఈ మొత్తాన్ని రెండు పంటల కాలాలకు (ఖరీఫ్, రబీ) విభజించి, ప్రతి సీజన్‌కు ఎకరాకు రూ. 6,000 చొప్పున నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారు.

### కొత్త రైతులకు అవకాశం

ఇప్పటివరకు నమోదు చేసుకోని వారు, అలాగే ఇటీవల జూన్ 15వ తేదీ లోపు కొత్తగా వ్యవసాయ భూములను కొనుగోలు చేసి పట్టాదారు పాస్‌పుస్తకాలు పొందిన రైతులకు కూడా ప్రభుత్వం ఈ పథకంలో అవకాశం కల్పించింది. జూలై 5 వ తేదీ లోపు అర్హులైన కొత్త రైతులు దరఖాస్తు చేసుకోవచ్చు. పట్టాదారు పాస్‌బుక్ జిరాక్స్, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా వివరాలతో కూడిన అప్లికేషన్‌ను తమ పరిధిలోని వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈవో) లేదా మండల వ్యవసాయ అధికారి (ఎంఏవో) కి సమర్పించాల్సి ఉంటుంది. ఒకవేళ అర్హత ఉండి కూడా సాంకేతిక కారణాల వల్ల ఖాతాల్లో డబ్బులు జమ కాకపోతే, సంబంధిత వ్యవసాయ శాఖ లేదా రెవెన్యూ అధికారులను సంప్రదించాలని అధికారులు సూచించారు.



## బెల్ట్ షాపులను మూసివేయాలని ప్రజావాణిలో ఫిర్యాదు

శాయంపేట, జూన్ 29 (అక్షర దర్బార్) : శాయంపేట మండల కేంద్రంలో అక్రమంగా నడుస్తున్న బెల్ట్ షాపులను తక్షణమే మూసివేయాలని కోరుతూ హనుమకొండ జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్, మద్యం నిషేధిత మరియు అబ్కారీ శాఖ డిప్యూటీ కమిషనర్‌లకు తెలంగాణ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా నాయకులు, హనుమకొండ జిల్లా కార్యదర్శి వంగర సాంబయ్య ప్రజావాణిలో వినతిపత్రాన్ని అందజేశారు. శాయంపేట పరిధిలో బెల్ట్ షాపుల వల్ల ప్రజలు, ముఖ్యంగా మహిళలు ఇబ్బందులు పడుతున్నారని, వీటిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఓటర్ల సవరణ కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించాలి

### తహసీల్దార్ తూకుంట్ల వసంతరావు

చిట్యాల, జూన్ 29 (అక్షర దర్బార్) : చిట్యాల మండలంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని అధికారులు సక్రమంగా, త్వరితగతిన నిర్వహించాలని తహసిల్దార్ తూకుంట్ల వసంతరావు కోరారు. సోమవారం తన కార్యాలయంలో అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. చిట్యాల మండలంలోని మొత్తం 38 పోలింగ్ బూత్‌లకు మండల అధికారులను స్పెషల్ ఆఫీసర్లుగా రెవిన్యూ డివిజనల్ అధికారి నియమించినట్లు తెలిపారు. ప్రభుత్వం ఈ ప్రక్రియను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నందున, అధికారులు పూర్తిస్థాయిలో దృష్టి సారించి ఎన్యుమరేషన్ ఫారాల సమాచారాన్ని ఆన్లైన్లో అప్లోడ్ చేయాలన్నారు. బూత్ లెవెల్ అధికారులతో అనుసంధానం చేసుకుంటూ వచ్చే నెల 24వ తేదీ లోపు 100 శాతం ఓటర్ లిస్ట్ ప్యూరిఫికేషన్ పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో జయశ్రీ, వెటర్నరీ డాక్టర్ అజయ్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.




## రైతు భరోసా దరఖాస్తుల గడువు జూలై 5 వరకు పొడిగింపు

పరకాల, జూన్ 29 (అక్షరదర్బార్): రైతు భరోసా పథకం కింద అర్హులైన రైతులు జూలై 5 లోపు సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈవో) లేదా మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని మండల వ్యవసాయ అధికారి ఎస్. శ్రీనివాస్ తెలిపారు. కొత్తగా పట్టాదారు పాసుబుక్కులు పొందిన వారు, గత సీజన్లలో సాంకేతిక కారణాలతో సాయం అందని వారు, బ్యాంకు ఖాతా, మొబైల్ నంబర్ వివరాల్లో లోపాలున్న రైతులు అవసరమైన పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అలాగే ప్రతి రైతు తప్పనిసరిగా రైతు నమోదులో తమ పేరును నమోదు చేసుకోవాలని కోరారు.



## టీచర్‌గా మారిన కలెక్టర్

- పిల్లల అభ్యసన సామర్థ్యాలపై అరా
- న్యూశాయంపేట అంగన్వాడీ కేంద్రంలో ఆకస్మిక తనిఖీ

అక్షరదర్బార్, హనుమకొండ: అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు సులభంగా అర్థమయ్యే విధంగా చార్టులు, బొమ్మలు, ఆట వస్తువులు (ప్లే ఎక్విప్‌మెంట్) వినియోగిస్తూ నాణ్యమైన బోధన అందించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి సూచించారు. సోమవారం హనుమకొండ న్యూశాయంపేట పోచంపల్లి ప్రభుత్వ పాఠశాల లోని అంగన్వాడీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలో చిన్నారుల హాజరు వివరాలను అంగన్వాడీ టీచర్ రమను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చిన్నారులతో నేరుగా మమేకమైన కలెక్టర్ వారికి సులభమైన ప్రశ్నలు అడిగి అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయుడి పాత్రలో బోర్డుపై ఆంగ్ల అక్షరాలు రాసి వాటిని గుర్తించగలరా అని అడిగి చిన్నారుల పఠన నైపుణ్యాన్ని పరీక్షించారు. బోధనలో ఉపయోగిస్తున్న చార్టులు, విద్యా సామగ్రి, అభ్యాస పట్టికలను పరిశీలించిన కలెక్టర్ వాటి వినియోగంపై అంగన్వాడీ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. చిన్నారులకు అందిస్తున్న పోషకాహార భోజనాన్ని తనిఖీ చేసి నాణ్యతపై ఆరా తీశారు. ఈ తనిఖీలో జిల్లా సంక్షేమ అధికారి విశ్వజతో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.





## మొగుళ్లపల్లిలో ఏఎస్ఐ వెంకటరత్నం దంపతులకు ఘన సన్మానం

మొగుళ్లపల్లి, జూన్ 29 (అక్షర దర్బార్): మొగుళ్లపల్లి పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా సుదీర్ఘ కాలం విధులు నిర్వహించి పదవీ విరమణ చేయనున్న రాజారపు వెంకటరత్నం, ఆయన సతీమణిని పోలీస్ స్టేషన్ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఎస్సై సురేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమంలో వెంకటరత్నం దంపతులకు పూలమాలలు వేసి, శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్సై సురేష్ మాట్లాడుతూ విధి నిర్వహణలో వెంకటరత్నం చూపిన అంకితభావం, నిబద్ధత యువ పోలీసు సిబ్బందికి స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వర్షాలు కురవాలని హుస్సేన్‌పల్లిలో మహిళల కుండ పూజలు



శాయంపేట, జూన్ 29 (అక్షర దర్బార్): శాయంపేట మండలంలోని హుస్సేన్‌పల్లి గ్రామంలో మంచి వర్షాలు కురిసి రైతులకు సమృద్ధిగా పంటలు పండాలని ఆకాంక్షిస్తూ గ్రామ మహిళలు సంప్రదాయబద్ధంగా కుండ పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు కోలాటాలు ఆడి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గ్రామంలో సకాలంలో వర్షాలు కురిసి ప్రజలు, రైతులు సుభిక్షంగా ఉండాలని వేడుకున్న ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఖానాపూర్ శివారులో చిరుత పులి సంచారం

## ప్రజల్లో భయాందోళనలు

ఖానాపూర్, జూన్ 29 (అక్షర దర్బార్) : మండల కేంద్రంలోని రాగంపేట శివారులో చిరుత పులి సంచరిస్తుండటం స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది. పరిసరాల్లో విస్తారంగా పామాయిల్ తోటలు ఉండటంతో నక్కల వర్రే కాలువ వెంబడి అటవీ ప్రాంతం నుండి పులి ఇక్కడికి వచ్చినట్లు అనుమానిస్తున్నారు. ఆదివారం ఉదయం బహిర్భూమికి వెళ్లిన నాగ అనే వ్యక్తికి చిరుత కనిపించగా, దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు వెంటనే అప్రమత్తమై పాదముద్రల కోసం దర్యాప్తు ప్రారంభించారు. గ్రామస్తులు ఒంటరిగా పొలాలకు, అడవి వైపు వెళ్లవద్దని అధికారులు హెచ్చరించారు.



# పత్తిపాక గ్రామ సభలో వార్డుల సమస్యలపై కాలనీ వాసుల వినతి

శాయంపేట, జూన్ 29 (అక్షర దర్బార్) : శాయంపేట మండలం పత్తిపాక గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో 11, 12 వార్డుల కాలనీ వాసులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సర్పంచ్ గజ్జి ఐలయ్య, ఉపసర్పంచ్ రాజు, పంచాయతీ కార్యదర్శి రాజారాంలకు వినతిపత్రం అందజేశారు. కాలనీలోని ఈరమ్మ గండిలలో నీరు నిల్వ ఉండకుండా ప్రవహించేలా చర్యలు తీసుకోవాలని, లేకపోతే దోమల వ్యాప్తితో అనారోగ్యాలు తలెత్తుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే 11వ వార్డులో ఇళ్లపై నుండి వెళ్తున్న 11 కేవీ విద్యుత్ లైన్లు, ఇళ్ల మధ్యలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వల్ల తరచూ ఎర్త్ రిటర్న్ సమస్య ఏర్పడి టీవీలు, ఫ్రిజ్‌లు వంటి పరికరాలు దెబ్బతింటున్నాయని, ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కందగట్ల ప్రవీణ్ కుమార్, ప్రకాశం, అరుణ పాల్గొన్నారు.



# పిడిసిల్ల శివాలయంలో చోరీ


## రెండు బ్యాటరీ ఇన్వెర్టర్లు అపహరణ

మొగుళ్లపల్లి, జూన్ 29 (అక్షర దర్బార్): మొగుళ్లపల్లి మండలంలోని పిడిసిల్ల గ్రామ శివాలయానికి చెందిన రెండు ఇన్వర్టర్ బ్యాటరీలను దొంగిలించినట్లు శివాలయ కమిటీ అధ్యక్షుడు కట్కూరి సునీల్ రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. రిపేర్ చేయించిన ఈ బ్యాటరీలను జూన్ 25న ఆలయ ఆవరణలో ఉంచగా, జూన్ 28న ఉదయం అవి కనిపించకుండా పోయాయని పేర్కొన్నారు. దొంగిలించబడిన బ్యాటరీల విలువ సుమారు రూ. 20,000 ఉంటుందని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం. సురేష్ తెలిపారు.



# బీజేపీ బూత్ సమ్మేళనానికి భారీగా తరలివెళ్లిన పరకాల శ్రేణులు

పరకాల, జూన్ 29 (అక్షర దర్బార్) : హనుమకొండ సుబేదారి ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ మైదానంలో సోమవారం నిర్వహిస్తున్న బీజేపీ బూత్ సమ్మేళనానికి పరకాల పట్టణ బీజేపీ నాయకులు, కార్యకర్తలు కాన్వాయ్‌తో భారీ సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించిన పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్ మాట్లాడుతూ బూత్ స్థాయి నుంచే పార్టీని మరింత బలోపేతం చేయడమే ఈ సమ్మేళనం ప్రధాన ఉద్దేశమని అన్నారు. జాతీయ నాయకత్వం చేపట్టిన ఈ కార్యక్రమం శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుక్కల విజయ్ కుమార్, కౌన్సిలర్లు ఆకుల లావణ్య శ్రీధర్, చందుపట్ల రాజేందర్ రెడ్డి, పాలకుర్తి తిరుపతి పాల్గొన్నారు.




# పరకాలలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడించిన సీఐటీయూ

పరకాల, జూన్ 29 (అక్షర దర్బార్) : మున్సిపల్ కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని, అప్పటివరకు నెలకు రూ. 26 వేల కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం పరకాలలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడించారు. నగర పంచాయతీ కార్యాలయం నుంచి అంబేద్కర్ సెంటర్ మీదుగా భారీ ర్యాలీ నిర్వహించిన కార్మికులు, ఏళ్ల తరబడి సేవలు అందిస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. విధుల్లో మరణించిన వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలని, ఇందిరమ్మ ఇళ్లలో ప్రాధాన్యం కల్పించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే తరఫున టౌన్ అధ్యక్షుడు ఒంటేరు శ్రావణ్ కుమార్, కౌన్సిలర్ కోయిడ శ్రీనివాస్ వినతిపత్రం స్వీకరించారు. ఈ ఆందోళనలో బొట్ల చక్రపాణి, బొచ్చు కళ్యాణ్, మడికొండ ప్రమోద్ కుమార్ పాల్గొన్నారు.




# అంగన్‌వాడీ నియామకాల్లో ఇంటర్వ్యూలు వద్దు

## బొచ్చు రాజు స్వేరో

పరకాల, జూన్ 29 (అక్షరదర్బార్): రాష్ట్రంలో అంగన్‌వాడీ టీచర్, సహాయకుల నియామకాలను ఇంటర్వ్యూ విధానం ద్వారా కాకుండా రాత పరీక్ష ఆధారంగానే భర్తీ చేయాలని వరంగల్ కాంటెస్టెంట్ ఎంపీ, స్వేరో టిఆర్ఎస్ నాయకుడు బొచ్చు రాజు స్వేరో డిమాండ్ చేశారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌కు ప్రజావాణిలో ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న 15,982 పోస్టుల భర్తీలో ఇంటర్వ్యూ విధానాన్ని ప్రవేశపెట్టడం వల్ల అవకతవకలకు, సిఫారసులకు అవకాశం ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రూప్ ఉద్యోగాల తరహాలోనే ఇంటర్వ్యూలు రద్దు చేసి రాత పరీక్ష మెరిట్ ప్రకారం, అలాగే అభ్యర్థి ఆయా కేంద్రం పరిధిలోని వార్డు లేదా గ్రామానికి చెందిన శాశ్వత స్థానిక నివాసి అయి ఉండేలా ఎంపికలు చేపట్టాలని కోరారు.





# బాధిత కుటుంబాలను పరామర్శించి, సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన సిరికొండ

చిట్యాల, జూన్ 29 (అక్షర దర్బార్) : చిట్యాల మండలంలో ఇటీవల మృతి చెందిన పలువురి కుటుంబాలను శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనా చారి సోమవారం పరామర్శించి ఓదార్చారు. చల్లగరిగకు చెందిన నోముల సదమ్మ, గుల్లం జిలాని, అలాగే జూకల్‌కు చెందిన తాంపు భద్రయ్య, సౌడ కిషన్ కుటుంబ సభ్యులను కలిసి తన ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించి ఆర్థిక సహాయం అందించారు. అనంతరం ఎంపేడ్‌కు చెందిన శ్రీపతి రాజుకు రూ. 60,000, మాచర్ల వెంకటరాచంకు రూ. 36,000లతో పాటు పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు చింతల రమేష్ ముదిరాజ్, రత్న రవి, చంద్రమౌళి పాల్గొన్నారు.



# ప్రభుత్వ భూములను అమ్మే బ్రోకర్లపై కఠిన చర్యలు తీసుకోవాలి

చిట్యాల, జూన్ 29 (అక్షర దర్బార్) : ప్రభుత్వ భూములను అక్రమంగా అమ్ముతున్న బ్రోకర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ విముక్తి చిరుతల పార్టీ (వీసీకే) గ్రేటర్ హైదరాబాదు ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు సిరిపెల్లి రమేష్ సోమవారం చిట్యాల తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. చల్లగరిగ గ్రామ శివారులోని సర్వే నెంబర్ 308 లో గల డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల స్థలాలను ఆక్రమించి అమ్ముకున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ముచ్చినపర్తి శివారులోని 186 సర్వే నెంబర్ భూమిలో భారీ కుంభకోణం జరుగుతోందని ఆరోపిస్తూ, సదరు భూములను రక్షించి భూమిలేని నిరుపేద కుటుంబాలకు పంపిణీ చేసి జీవనోపాధి కల్పించాలని రమేష్ కోరారు.

